సాక్షి మంచిర్యాల

గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



బడి ప్రగతికి బాటలు

ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లోని విద్యార్థుల సమగ్ర సమాచారం ఒకేచోట నమోదుకు కేంద్ర ప్రభుత్వం యూడైస్ ప్లస్ పోర్టల్ తీసుకొచ్చింది. వివరాల నమోదు కొనసాగుతోంది. 8లో▸

నిండుకుండలా 'ఎల్లంపల్లి'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరి నిండుకుండలా మారింది. పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను బుధవారం 20.175 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 4 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 323 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా, 3,500 క్యూసెక్కుల నీటిని మూడు గేట్ల ద్వారా గోదావరిలోకి విడుదల చేస్తున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0 /24.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాయువ్యం దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

మంచిర్యాలలో బ్యాడ్మింటన్ పోటీలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక హైటెక్‌సిటీ క్లబ్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న అండర్–19 బ్యాడ్మింటన్ జోనల్‌స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు కాలేజీ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరి బాబురావు తెలిపారు. క్రీడాకారులు ఈ నెల 21న ఉదయం 9గంటలకు మంచిర్యాల హైటెక్‌సిటీ క్లబ్‌లో రిపోర్టు చేయాలని సూచించారు.

20న లాన్‌టెన్నిస్ ఎంపిక పోటీలు

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 20న బెల్లంపల్లిలో ఐటీవోసీ క్లబ్‌లో అండర్–14, 17 బాలబాలికల లాన్ టెన్నిస్ జోనల్‌స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. క్రీడాకారులు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



చిన్నారుల ఎత్తును పరిశీలిస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: చిన్నారుల ఆరోగ్యంపై తల్లులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా సంక్షేమ అధికారి స్వరూపరాణి అన్నారు. బుధవారం మండలంలోని తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సామ్, మామ్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని చిన్నారులకు వైద్య, పెరుగుదల పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి తమ్మడి ఎవంజలీన్ చిన్నారులకు ప్రత్యేక వైద్య పరీక్షలు, ఎత్తు, బరువు పరీక్షించారు. అనంతరం స్వరూపరాణి మాట్లాడుతూ తల్లులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పుష్పలత, విష్ణుప్రియ, ప్రసన్న, ప్రభావతి, హెల్త్ సూపర్‌వైజర్ మల్లిక, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాల్లో సేవలను విస్తృతపర్చాలి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని బస్తీ దవాఖానాల్లో వైద్య సేవలను విస్తృతపర్చాలని డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ అన్నారు. జాతీయ ప్రామాణికత దిశగా బస్తీ దవాఖానాలను సిద్ధం చేసేందుకు జిల్లాలో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. బృందంలో సభ్యులుగా డాక్టర్ అనిల్, డీపీవో ప్రశాంతి, డాక్టర్ శివప్రతాప్, స్టాఫ్‌నర్సు పద్మజ, ఫార్మాసిస్టు శిరీష, ల్యాబ్ టెక్నీషియన్ గోపీలను నియమించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని హమాలీవాడ, సాయికుంట, బెల్లంపల్లిలోని బస్తీ దవాఖానాలు జాతీయ ప్రామాణికతకు ఎంపికయ్యేలా సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృపాబాయి, సాగర్, ప్రవళిక, జాతీయ ఆరోగ్య మిషన్ వైద్యులు రమ్య, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం పెంచాలని వినతి

మంచిర్యాలఅగ్రికల్చర్: నష్ట పరిహారం పెంచాలని డిమాండ్ చేస్తూ గ్రీన్‌ఫీల్డ్ హైవే జైపూర్ మండల భూ నిర్వాసితులు కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. మండల పరిధి రోడ్డు నిర్మాణం ద్వారా పది గ్రామాల రైతులు నష్టపోవాల్సి వస్తోందని, రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు చేసి గజానికి రూ.4 వేల నుంచి రూ.5 వేల చొప్పున విక్రయిస్తున్నారని తెలిపారు. ఎకరాకు రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు ధర పలుతోందని, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పరిహారం రూ.8 నుంచి రూ.9 లక్షలు నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. ఎకరాకు నష్టపరిహారం రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జైపూర్ మండలంలోని వివిధ గ్రామాల భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

అన్‌ఫిట్ దందా ఆగేనా?

> సింగరేణి సంస్థ పూర్తి పారదర్శకంగా, అవినీతి రహితంగా కార్యక్రమాలు చేపడుతోంది. కానీ కొందరు అక్రమార్కులు అమాయకులైన కార్మికులను మోసం చేస్తున్నారని తెలుస్తోంది. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.
> – కంపెనీ విజిలెన్స్ విభాగం సమీక్షలో సీఎండీ ఎన్.బలరామ్ హెచ్చరిక



గని కార్మికులు

- సింగరేణిలో దళారుల ప్రమేయం
- బయటపడకుండా అక్రమంగా వసూళ్లు
- ఇన్‌వ్యాలిడేషన్ కోసం రూ.లక్షలు ఖర్చు
- తీవ్రంగా పరిగణిస్తున్న సంస్థ సీఎండీ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సింగరేణి కార్మికులు అనారోగ్యం బారిన పడితే తమ వారసులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగ అవకాశం కల్పిస్తోంది. దీన్ని ఆసరాగా చేసుకుని అనేకమంది దళారులు, మధ్యవర్తులు అన్‌ఫిట్ చేయిస్తామని కార్మికుల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. కంపెనీ కార్పొరేట్ మెడికల్ బోర్డు, ఉన్నత స్థాయిలో తమకు పరిచయాలు ఉన్నాయంటూ భారీయెత్తున డబ్బు గుంజుతున్నారు. మరోవైపు కార్మికులు సైతం తమ వారసులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తే చాలు అన్నట్లుగా డబ్బులు ఇచ్చేందుకు వెనుకాడడం లేదు. దీంతో ఈ ప్రక్రియలో గత కొన్నేళ్లుగా దందా సాగుతూనే ఉంది. జిల్లాలో అనేకమంది కార్మికులు డబ్బులు ఇచ్చినా అన్‌ఫిట్ కాని సంఘటనలు ఉన్నాయి. డబ్బులు ఇవ్వడం కూడా నేరం.. తమపైనా చర్యలు తీసుకుంటారనే భయంతో ఈ తెరచాటు వ్యవహారాలు ఎక్కడా బయటకు రావడం లేదు. ఒకవేళ నిబంధనల ప్రకారం మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ చేసినా తామే చేయించామని కార్మికుల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్న దళారులూ ఉన్నారు. గత సర్కారులో మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ దందాపై ఆరోపణలు రాగా విచారణలు సాగాయి. విజిలెన్స్, ఏసీబీ కేసులు నమోదు చేసింది. జిల్లాలోనూ పలువురు దళారుల ప్రమేయం వెల్లడైంది.

పాతుకుపోయిన దళారులు

కార్మికులకు మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ చేయిస్తామని చెప్పుకునే దళారులు కోల్‌బెల్ట్ వ్యాప్తంగా ఉన్నారు. ఫలాన లీడర్, మధ్యవర్తితో వెళ్తే పని అవుతుందనే భావన ఇప్పటికీ చాలామంది కార్మికుల్లో ఉంది. దీంతో ఈ దందాకు ఫుల్‌స్టాప్ పడడం లేదు. రెండేళ్ల సర్వీసు ఉన్న కార్మికులు విధులు నిర్వర్తించలేని జబ్బు బారిన పడితే కంపెనీ నిబంధనల ప్రకారం ఇన్‌వ్యాలిడేటెడ్ అయిన కార్మికులు విధులకు హాజరు కావాల్సిన అవసరం ఉండదు. వారి స్థానంలో వారసులకు కారుణ్య నియామకం కింద అవకాశం కల్పిస్తారు. బోర్డు నుంచి 'ఫిట్ ఫర్ సేమ్ జాబ్' సర్టిఫికెట్ వస్తే యథావిధిగా విధుల్లోకి వెళ్లాలి. అలా కాకుండా 'అన్‌ఫిట్ ఫర్ అండర్‌గ్రౌండ్ ఫిట్ ఫర్ సర్ఫేస్' అని వస్తే భూగర్భంలో కాకుండా ఉపరితలంలో తేలికపాటి విధుల్లో చేరాలి. అలాకాకుండా కొందరిని హయ్యర్ కమిటీకి సిఫార్సు చేస్తుంటారు. వీరికి ఉన్నతస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాతే నిర్ధారిస్తారు. ఇందులో కేంద్ర కమిటీ సిఫార్సు మేరకు తదుపరి చర్యలు ఉంటాయి. ఈ క్రమంలో తమ వారసులకు ఎలాగైనా ఉద్యోగం ఇప్పించాలని రూ.3లక్షల నుంచి రూ.6లక్షల వరకు వెచ్చిస్తున్నారనే ప్రచారం ఉంది. వీటితోపాటు రెగ్యులర్, ఇంటర్నల్ నియామక పరీక్షల్లోనూ ఉద్యోగాలు వచ్చేలా చేస్తామంటూ దళారులు నిరుద్యోగులకు ఆశ పెడుతున్న ఘటనలు ఉన్నాయి. వీటన్నింటిని కంపెనీ తీవ్రంగా పరిగణిస్తోంది.

పట్టిస్తే రూ.పదివేల నజరానా..

గత కొంతకాలంగా మెడికల్ అన్‌ఫిట్ దందాపై వస్తున్న ఫిర్యాదులు, నమోదైన కేసులను సీఎండీ బలరాం తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఇలాంటివి ఇకనుంచి జరగకుండా ఉండాలని కంపెనీ విజిలెన్స్ విభాగాన్ని ఆదేశించారు. సొంత ఉద్యోగులే అక్రమాలకు పాల్పడితే వారినీ ఉద్యోగాల నుంచి తొలగించడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా తప్పుడు సర్టిఫికెట్లతో అన్‌ఫిట్ అయితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎక్కడైనా ఇలాంటి అక్రమాలకు పాల్పడినట్లు తెలిసినా, జరిగినా విజిలెన్స్ అధికారులను 9491144104 నంబరులో సంప్రదించాలని కోరారు. అలా పట్టించిన వారికి రూ.10వేల నజరానా ఇస్తామని ప్రకటించారు.

'కేంద్ర మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం'



కేంద్రమంత్రి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

జన్నారం: ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీపై కేంద్ర మంత్రి రవ్నీత్‌సింగ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చర్యలు తీసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి రవ్నీత్‌సింగ్ వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం మండల కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశం కోసం త్యాగం చేసిన కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీపై ఆరోపణలు చేయడం అవివేకానికి నిదర్శనమని అన్నారు. కేంద్రమంత్రి వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహేల్, జిల్లా నాయకుడు అజ్మత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజఫర్ అలీఖాన్, మండల నాయకులు షాకీర్, రాజశేఖర్, మహేశ్, గంగన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో ఘనంగా పౌర్ణమి జాతర

దండేపల్లి: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో పౌర్ణమి జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సత్యదేవుణ్ని దర్శించుకున్నారు. 107 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. దీంతో ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. జాతర సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో శ్రీనివాస్, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు ఇబ్బందులు లేకుండా చూశారు.

మ్యాన్‌రైడింగ్ పైనుంచి పడి కార్మికుడు మృతి

- మందమర్రి ఏరియాలోని కేకే–5 గనిలో ఘటన
- గని ప్రమాదంగా గుర్తించాలని కార్మికుల ఆందోళన



ఆందోళనలో కార్మికులు, నాయకులు



లక్ష్మణ్(ఫైల్)

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–5 గనిలో మంగళవారం జరిగిన ప్రమాదంలో సింగరేణి కార్మికుడు మృతిచెందాడు. మ్యాన్‌రైడింగ్‌పై ఉపరితలానికి వస్తుండగా కిందపడడంతో మృత్యువాతపడ్డాడు. గని ప్రమాదంగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు నాలుగు గంటలపాటు ఆందోళన నిర్వహించారు. కార్మికులు, యూనియన్ నాయకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మందమర్రికి చెందిన మోకనపల్లి లక్ష్మణ్ కేకే–5 గనిలో కోల్‌కట్టర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రెండో షిఫ్ట్‌లో ఫిట్టర్‌కు హెల్పర్‌గా గనిలోకి వెళ్లాడు. భూగర్భంలో విధులు ముగించుకుని రాత్రి 10.15గంటల ప్రాంతంలో ఉపరితలానికి వచ్చేందుకు 24వ లెవల్ వద్ద మ్యాన్‌రైడింగ్ ఎక్కాడు. గనిలోని 15పోల్ 2వ లెవల్ వద్ద ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. వెనుకాల వచ్చే తోటి కార్మికులు మధుసూదన్‌రెడ్డి, నెల్లి శ్రీనివాస్, ప్రకాశ్, భాస్కర్ కిందపడిపోయిన లక్ష్మణ్‌ను గుర్తించి ఉపరితలానికి తీసుకొచ్చి అంబులెన్స్‌లో కేకే డిస్పెన్సరీకి తీసుకెళ్లారు. అక్కడ వైద్యుడు లేకపోవడంతో రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి లక్ష్మణ్(41) మృతిచెందినట్లు తెలిపారు.

కార్మికుల ఆందోళన

కార్మికుడు లక్ష్మణ్ మృతిని గని ప్రమాదంగా పరిగణించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం గని వద్ద మొదటి షిఫ్టు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. సంస్థ నుంచి రావాల్సిన అన్ని బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలోనే కిందపడిపోవడంతో గని ప్రమాదంలో మృతిచెందినట్లు రిపోర్టు నమోదు చేస్తేనే కార్మికుడి కుటుంబానికి న్యాయం జరుగుతుందని అన్నారు. నాలుగు గంటల ఆందోళన అనంతరం.. ప్రమాదకర మృతిగానే పరిగణిస్తామని అధికారులు హామీనివ్వడంతో కార్మికులు ఆందోళన విరమించి విధులకు హాజరయ్యారు.

రక్షణపై యాజమాన్యానికి శ్రద్ధ లేదన్న కార్మిక నాయకులు

బొగ్గు ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల రక్షణపై యాజమాన్యానికి లేదని కార్మిక సంఘాల నాయకులు మండిపడ్డారు. గనిపై అందుబాటులో అంబులెన్స్ ఉండదని, ఏరియా ఆసుపత్రిలో వైద్యుడు ఉండరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగితే గని వద్దకు వచ్చే అంబులెన్స్‌లో డ్రైవర్ తప్ప ఇతర వైద్య సిబ్బంది కూడా లేకపోవడం వల్ల సమయానికి ప్రథమ చికిత్స అందక చనిపోతున్నారని ఆరోపించారు. గని ఆవరణలో అంబులెన్స్, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

కొడుకు పుట్టిన రోజు వేడుకగా చేయాలని..

మందమర్రి పట్టణంలోని మొదటి జోన్‌కు చెందిన లక్ష్మణ్‌కు భార్య సరిత, కూతురు అర్చన, కుమారుడు అజిత్ ఉన్నారు. గత సంవత్సరం కుమారుడు జన్మించగా.. గురువారం బర్త్‌డే ఫంక్షన్ వేడుకగా చేయాలని లక్ష్మణ్ అన్ని ఏర్పాట్లు చేశాడు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ బుక్ చేశాడు. పుట్టిన రోజు వేడుక కోసమని బుధ, గురువారం రెండ్రోజులు సెలవు పెట్టినట్లు సమాచారం. ఈ ఘటన జరగడంతో శాశ్వతంగా సెలవు తీసుకున్నట్లయింది. ఇంటి పరిసరాల్లో విషాదం నెలకొంది.

మత్తడి కూల్చిందెవరు..!



పేల్చివేతకు ధ్వంసమైన మత్తడి వద్ద ఇసుక బస్తాలు, నీరంతా పోవడంతో ఖాళీగా శనిగకుంట

- ఎయిర్ డిటోనేటర్లు వినియోగించారా..?
- ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదుపై స్పందించని పోలీసులు
- స్థానికుల హస్తం ఉందనే అనుమానాలు
- పోలీసుల అదుపులో ఇద్దరు

చెన్నూర్: చెన్నూర్ పట్టణానికి కూతవేటు దూరం, 63వ జాతీయ రహదారి పక్కనే ఉన్న శనిగకుంట మత్తడిని పక్కా ప్రణాళికతో పేల్చివేసినట్లు తెలుస్తోంది. ఒక్కరితో అయ్యే పని కాదని, కొందరు సమూహంగా ఏర్పడి ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తోంది. స్థానికుల ప్రమేయంతో పేల్చివేతలో నైపుణ్యం ఉన్న వ్యక్తులు పాల్గొన్నట్లు తెలుస్తోంది. మత్తడికి గుర్తు తెలియని వ్యక్తులు రంధ్రాలు చేశారని చెన్నూర్ పోలీసులతోపాటు స్థానిక తహసీల్దార్‌కు ఇరిగేషన్ ఈఈ విష్ణుప్రసాద్ ఈ నెల 13న రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నెల 16న పేల్చివేత ఘటన చోటు చేసుకోగా.. 17న వెలుగులోకి వచ్చింది. ఫిర్యాదుపై వెంటనే పోలీసులు స్పందించి విచారణ చేపట్టి ఉంటే పేల్చివేతను భగ్నం చేసే అవకాశాలు ఉండేవని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనకు పాల్పడినట్లుగా అనుమానం ఉన్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

42 ఎకరాల ఆయకట్టు..

శనిగకుంట 39 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా.. 42 ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాలు సమృద్ధిగా కురిస్తే రెండు పంటలకు సాగు నీరందుతుంది. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురువడంతో రెండో పంటకు సరిపడా నీరు ఉండడంతో రైతులు యాసంగి పంట సాగు చేశారు. మత్తడి పేల్చివేతతో ఆందోళన చెందుతున్నారు.

ఎయిర్ డిటోనేటర్లేనా..

మత్తడి పేల్చివేతలో ఎయిర్ డిటోనేటర్లు వాడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ప్రాంతంలో డిటోనేటర్లు పేల్చే వ్యక్తులు లేకపోవడంతో బయట నుంచి కొందరిని రప్పించి మందుగుండు సామగ్రితో పేల్చి ఉంటారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

నిమజ్జనాన్ని అదునుగా చేసుకుని..

చెన్నూర్ పట్టణంలో అంతా ఆదివారం గణేశ్ నిమజ్జనం సందడిలో ఉన్నారు. డీజే సౌండ్ సిస్టం, బాణసంచా చప్పుళ్ల మధ్య ప్రజలు ఆనందోత్సవాల్లో మునిగిపోయారు. ఇదే అదునుగా భావించిన దుండగులు డ్రిల్లింగ్ పనులు పూర్తి చేసి.. సమీపంలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఎయిర్ డిటోనేటర్లు వినియోగించి బ్యాటరీ ద్వారా పేల్చి వేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

'రియల్' ధ్వంసం

చెన్నూర్‌కు తలమానికమైన పవిత్ర గోదావరి నది సమీపంలో శనిగకుంటను దశాబ్దాల కాలం క్రితమే నిర్మించారు. ఆనాడు నీటి వనరుల కొరత లేకుండా పట్టణ నడిబొడ్డున పెద్ద చెరువుతోపాటు చుట్టూ శనిగకుంట, కుమ్మరికుంట, మల్లెమేన కుంట, గాలికుంటలను ఏర్పాటు చేశారు. ఈ నాలుగు కుంటల కింద సుమారు రెండు వేల ఎకరాల పంటలు సాగుతోపాటు పశువులు, పక్షుల దాహార్తిని తీర్చేందుకు నిర్మాణం చేపట్టారు. గతంలో ముందు చూపుతో నిర్మించిన గొలుసుకట్టు చెరువుల ఆనవాళ్లు లేకుండా చేసేందుకు కొందరు కుట్ర పన్ని రియల్ దందాల పేరుతో ధ్వంసం చేస్తున్నారు. ప్రధాన చెరువులతోపాటు గొలుసుకట్టు చెరువులను పరిరక్షించాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఆనవాళ్లు లేకుండా పోతున్నాయని పట్టణ వాసులు పేర్కొంటున్నారు.

ఉపాధి కోల్పోయాం



శనిగకుంటలో ఉపాధి కోసం ఈ ఏడాది రూ.3 లక్షల విలువైన చేపపిల్లలు వేశాం. చేపల ద్వారా 20 మందికి ఉపాధి లభిస్తుందని ఆశపడ్డాం. చెరువులో నీరు ఉంటే మూడు నెలలు ఉపాధి దొరికేది. మత్తడి కూల్చివేయడంతో చేపపిల్లలు మొత్తం వరదలో కొట్టుకుపోయాయి. తీవ్ర నష్టం జరిగింది. కూల్చి వేసిన వారిని పట్టుకుని శిక్షించాలి. నష్టపోయిన మత్స్యకారులకు ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– అంబాటి శంకర్, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు, చెన్నూర్

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్
- గోదావరి నీటి సరఫరా పనులకు భూమిపూజ



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వినోద్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారంగా బెల్లంపల్లి పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన గోదావరి జలాలు సరఫరా చేయిస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బుధవారం కన్నాల శివారులోని మిషన్ భగీరథ పంపుహౌజ్ వద్ద అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.61.50 కోట్లతో చేపట్టనున్న గోదావరి నీటి సరఫరా పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నేరుగా బెల్లంపల్లికి గోదావరి జలాలు సరఫరా అవుతాయని తెలిపారు. 11 నెలల్లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం పక్కనే ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను ఎమ్మెల్యే, కలెక్టర్ పరిశీలించారు. జీప్లస్ వన్ తరహాలో నిర్మించిన ఇళ్లలోకి వెళ్లి నాణ్యత, ఇతర పనులు ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. కొన్ని ఇళ్లు అసంపూర్తిగా ఉన్నట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.హరికృష్ణ, ఏసీపీ ఎ.రవికుమార్, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, చైర్ పర్సన్ జే.శ్వేత, కాంగ్రెస్ నాయకులు మునిమంద రమేష్, దావ రమేష్, నర్సింగరావు, సంతోష్, మురళీధర్‌రావు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

బెల్లంపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మండలంలోని పెర్కపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, బట్వాన్‌పల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులు, మూత్రశాలలు, తాగునీరు, పాఠశాలల పరిసరాలు, రిజిష్టర్లు పరిశీలించారు. బట్వాన్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు.

ఓటర్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

- జిల్లాలో 3,78,887 మంది ఓటర్లు
- మూడు విడతల్లో ఎన్నికలు
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ముసాయిదా ఓటర్ల జాబితాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 311 గ్రామ పంచాయతీలు ఉండగా.. మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. మొదటి విడతలో బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, కాసిపేట, నెన్నెల, తాండూర్, వేమనపల్లి, రెండవ విడతలో భీమారం, చెన్నూర్, జైపూర్, కోటపల్లి, మందమర్రి, మూడో విడతలో దండేపల్లి, హాజీపూర్, జన్నారం, లక్సెట్టిపేట మండలాల్లో ఎన్నికలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలో 2,730 వార్డుల్లో 1,87,402 మంది పురుష ఓటర్లు, 1,91,468 మంది మహిళా ఓటర్లు, 17 మంది ఇతరులు ఉన్నారని వివరించారు. గ్రామ పంచాయతీ ముసాయిదా జాబితాపై అందిన అభ్యంతరాలు ఈ నెల 30 వరకు పరిశీలించి తుది ఓటరు జాబితా ప్రదర్శిస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో జాబితా ప్రదర్శిస్తామని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు.

రుణమాఫీ చేయాలని గవర్నర్‌కు లేఖలు



లేఖలను పోస్టు చేస్తున్న రైతులు

నెన్నెల: పంట రుణమాఫీ అయ్యేలా చూడాలని మండల రైతులు రాష్ట్ర గవర్నర్‌కు బుధవారం లేఖలు రాశారు. మండలంలోని వివిధ గ్రామాల రైతులు లేఖలు రాసి నెన్నెలలో పోస్టు చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్, నాయకులు తిరుపతి, ఎండీ.ఇబ్రహీం రైతులకు మద్దతు ప్రకటించారు. రైతులు మాట్లాడుతూ రుణమాఫీ కాకపోవడంతో రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని తెలిపారు. రూ.2 లక్షలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి రోజుకో నిబంధనతో ఇక్కట్ల పాలు చేస్తున్నారని పేర్కొన్నారు. సర్వేల పేరిట మాఫీ ప్రక్రియను సాగదీస్తున్నారని అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా పంట రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

ఐఎన్‌టీయూసీ 327 ఉమ్మడి జిల్లా యూనియన్ ఎన్నిక


కే.సుదర్శన్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తెలంగాణ ట్రాన్స్‌కో విద్యుత్ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని బుధవారం పాత మంచిర్యాలలోని ఓ కన్వెన్షన్ హాల్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐఎన్‌టీయూసీ 327 రాష్ట్ర సెక్రెటరి జనరల్ ఇనుగాల శ్రీధర్, ఎస్‌పీడీసీఎల్ జేఏఓ పెద్ది రమేశ్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు జేఎల్‌ఎంలు, ఆర్టిజన్‌లు పెద్ద మొత్తంలో 327 యూనియన్‌లో చేరారు. ఇక ఉమ్మడి జిల్లా ఐఎన్‌టీయూసీ 327 నూతన అధ్యక్షుడిగా కె.సుదర్శన్(లైన్ ఇన్‌స్పెక్టర్), సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.వెంకటేశ్వర్(లైన్ ఇన్‌స్పెక్టర్), సభ్యులుగా రామకృష్ణ, మధూకర్, రవీందర్, సురేశ్, శ్రీనివాస్, గంగాధర్, ఉమ్మడి జిల్లా నుంచి పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు.

టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ డెప్యూటీ జనరల్ సెక్రెటరీగా వెంకటరమణ


వెంకటరమణ

బెల్లంపల్లి: తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) కేంద్ర కమిటీ డెప్యూటీ జనరల్ సెక్రెటరీగా బెల్లంపల్లికి చెందిన చంద్రగిరి వెంకటరమణ నియామకం అయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ప్రకటించారు. తనను కేంద్ర కమిటీ డెప్యూటీ జనరల్ సెక్రెటరీగా నియమించడంపై వెంకటరమణ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతమే లక్ష్యంగా పని చేస్తానని పేర్కొన్నారు.

కిడ్నాప్ కేసులో నిందితుల రిమాండ్

లక్సెట్టిపేట: కిడ్నాప్‌కు పాల్పడ్డ వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ ప్రకాష్, సీఐ నరేందర్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 14న మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో మత్స్య సహకార సంఘ ఎన్నికలు ఉన్నందున గ్రామానికి చెందిన శంకరయ్యకు లింగయ్య, సంతోష్ పోటీ వచ్చారని తెలిపారు. శంకరయ్య ఓటమి భయంతో ఇద్దరిని కిడ్నాప్ చేసినట్లు తెలిపారు. బాదె సరోజ ఫిర్యాదు మేరకు కిడ్నాప్‌కు గురైన వ్యక్తులను కనుగొన్నట్లు తెలిపారు. కిడ్నాప్‌కు సహకరించిన మహ్మద్ మహోద్దీన్, దేవేందర్, రవి, తరుణ్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తె లిపారు. రెండు కార్లు, రూ.4వేలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎస్సై సతీష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ యువ నాయకుడిపై దాడి !

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రం మంచిర్యాలలో సీసీసీ కార్నర్‌కు చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడిపై ఓ ప్రముఖ రియల్టర్ అండతో కొందరు వ్యక్తులు మంగళవారం రాత్రి దాడి చేశారు. పోలీసులు గణేశ్ నిమజ్జనం, శోభాయాత్ర బందోబస్తులో ఉండగా.. ఇదే అదునుగా భావించి ఐబీ చౌరస్తాలోని ఓ హోటల్ వెనుకాల దాడి చేసినట్లు బుధవారం వెలుగులోకి వచ్చింది. దాడిని పోలీసులు, బాధితులు రహస్యంగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై స్థానిక సీఐ బన్సిలాల్‌ను సంప్రదించగా.. దాడి విషయం తమ దృష్టికి రాలేదని, పద్మశాలినగర్ బోర్డు వద్ద అదే కాలనీలో పక్క పక్క బజారుకు చెందిన వారు గొడవ పడుతున్నారని సమాచారం రాగానే వెళ్లి సర్దిచెప్పి పంపించినట్లు తెలిపారు.

బడి ప్రగతికి బాటలు

- యూడైస్ ప్లస్ ఆధారంగా చర్యలు
- బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఇదే ప్రాతిపదిక
- విద్యాసంస్థల సమగ్ర సమాచారం నిక్షిప్తం
- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న వివరాల నమోదు


జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో అభ్యసిస్తున్న చిన్నారులు(ఫైల్)

ఉమ్మడి జిల్లాలో పాఠశాలల వివరాలు

జిల్లా	ప్రభుత్వ	ప్రైవేటు
నిర్మల్	842	192
ఆదిలాబాద్	1,279	151
మంచిర్యాల	869	221
కుమురంభీం	1,148	102

నిర్మల్‌ఖిల్లా/మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లోని విద్యార్థుల సమగ్ర సమాచారం ఒకేచోట నమోదుకు కేంద్ర ప్రభుత్వం యూడైస్ ప్లస్(ఇన్ఫర్మేషన్ ఫర్ ఎడ్యుకేషన్) పోర్టల్ తీసుకొచ్చింది. విద్యాశాఖ అందించే సమగ్ర వివరాల ఆధారంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించనుంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులు, బోధకుల వివరాలన్నీ నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 25వరకు యూడైస్ ప్లస్ 2024–25 విద్యాసంవత్సరం నమోదు ప్రక్రియ ముగియనుంది. ఇంతకు మునుపు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలోని సమాచారం నిక్షిప్తమై ఉండేది. ప్రస్తుతం ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు వివిధ విద్యాసంస్థల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మౌలిక వసతులు, సదుపాయాల వివరాలన్నీ నమోదు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నాలుగు వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలు, 40 పైచిలుకు ఇంటర్మీడియట్ కళాశాలలు, ప్రైవేటు బడులు, కళాశాలలకు సంబంధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, వసతుల వివరాలను యూడైస్ ప్లస్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. దీని ప్రకారం ఈ పోర్టల్‌కు ఉపాధ్యాయ, పాఠశాలల వివరాలను అనుసంధానం చేస్తున్నారు. ఒక్కో విద్యార్థి ఆధార్ సంఖ్య, పుట్టిన తే దీ, తరగతి వివరాలు పొందుపర్చుతున్నారు. గత 2021–22 సంవత్సరం వరకు యూడైస్ వివరా ల ను నమోదు చేయగా, గతేడాది నుంచి మాత్రం యూడైస్ ప్లస్ అనే పోర్టల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. ఇందులో నమోదు చేసిన, చేయాల్సిన వివరాలను మూడు విభాగాలుగా విభజించి నిక్షిప్తం చేస్తున్నారు..

తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గిపోతోంది. గతేడాది 1090 పాఠశాలల్లో 1,26,904 మంది ఉండగా ఈ ఏడాది 1,21,305కు పడిపోయింది. ఈ లెక్కన 5,559 మంది విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం, అర్హులైన ఉపాధ్యాయులు, మౌలిక వసతులున్నా విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

ఏమేం ఉన్నాయి..?

ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో యూడైస్ ప్లస్ లో వివరాలు నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో 1 నుంచి ఇంటర్ వరకు దాదాపు 2.5 లక్షల మంది విద్యార్థుల వివరాలను పొందుపరుస్తున్నారు. ఈ గణాంకాల ఆధారంగానే రాబోయే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులు, నిధుల విడుదలకు అవకాశం ఉంది. పాఠశాలల్లో తరగతి గదులు ఎన్ని ఉన్నాయి, విద్యార్థుల సంఖ్య, మరుగుదొడ్లు, ఆటస్థలాలు, వంటగదులు, తాగునీటి వసతి తదితర వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయనున్నారు. ప్రతీ విద్యార్థికి శాశ్వత విద్య క్రమ సంఖ్య(పీఈఎన్, పర్మినెంటు ఎడ్యుకేషన్ నంబరు) కేటాయించనున్నారు. దీంతో ఏయే తరగతుల్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారనే విషయం ఇట్టే తెలిసిపోతుంది. యూడైస్‌లో నమోదు చేసిన వివరాలను అత్యంత గోప్యంగా, ప్రామాణికంగా నిర్వహించడానికి వివిధ స్థాయిల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి శిక్షణ పూర్తి చేశారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా తమ పాఠశాలకు సంబంధించిన వివరాలు నమోదు చేస్తున్నారు. కాగా, వివరాల నమోదుపై నిర్మల్ డీఈవో డాక్టర్ ఏ.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల సమగ్ర వివరాల ద్వారా పారదర్శకత పెరుగుతుందని, వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించేలా ప్రభుత్వానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

మంచిర్యాల జిల్లాలో..

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నమోదులో వెనుకబడినట్లు తెలుస్తోంది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ప్రీప్రైమరీ నుంచి ఇంటర్ వరకు 1090 ఉన్నాయి. ఇందులో 1,21,305 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటివరకు 1090 పాఠశాలల్లో 797 పాఠశాలల సమగ్ర వివరాల నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. ఇంకా 293 పాఠశాలల నమోదు ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. జిల్లా వ్యాప్తంగా 221 ప్రైవేటు పాఠశాలలు ఉండగా 58,033 మంది చదువుతున్నట్లు ఇదివరకు లెక్కలున్నాయి. యాజమాన్యాలు డేటా పొందుపర్చడంలో మొక్కుబడిగా వ్యవహరిస్తున్నాయి. అపార్టుమెంటులో పాఠశాలలు కొనసాగిస్తుండడం, ఆటస్థలాలు లేకపోవడం వల్ల జాప్యం చేస్తున్నాయి. అర్హతలేని టీచర్లతో బోధన, తక్కువ వేతనాలు చెల్లిస్తుండడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. టీచర్లకు వేతనాలు అందక, తక్కువగా ఉన్నాయని మానేయడం యాజమాన్యాలకు కలిసి వస్తున్నాయి. దీంతో టీచర్ల కాకి లెక్కలతో డేటా నమోదు చేస్తూ తప్పించుకుంటున్నాయి. టీచర్లు ఎప్పుడు మానేస్తారో తెలియదని.. వివరాలు ఎలా నమోదు చేయాలో తెలియకుండా పోతోందని ప్రైవేటు యాజమాన్యాలు వాపోతున్నాయి.

క్రేన్ టైర్ కింద నలిగిన కార్మికుడు

- వినాయకుని నిమజ్జన సమయంలో ప్రమాదం
- చికిత్స పొందుతూ మృత్యువాత
- ఆస్పత్రి ఎదుట మృతదేహంతో కుటుంబ సభ్యులు, కార్మికుల ధర్నా
- ఎమ్మెల్యే, అధికారుల హామీతో ఆందోళన విరమణ


మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, కార్మికులు


మృతుడు లింగంపల్లి నగేశ్(ఫైల్)

కాగజ్‌నగర్‌రూరల్: వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటు చేసుకుంది. వినాయకుడి ప్రతిమను క్రేన్ సాయంతో ఎక్కించే క్రమంలో ఇద్దరు కాంట్రాక్టు కార్మికులకు గాయాలు కాగా.. చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నిమజ్జనోత్సవం సందర్భంగా స్థానిక పెద్దవాగు వద్ద మంగళవారం రాత్రి మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు లింగంపల్లి నగేశ్(46), ప్రేమ్‌కుమార్ విధులు నిర్వర్తిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో క్రేన్ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో క్రేన్ టైర్ల కిందపడి ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటినా పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. రెండు కాళ్లకు తీవ్ర గాయాలైన లింగంపల్లి నగేశ్‌ను వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యలో కరీంనగర్ సమీపంలో మృతిచెందాడు. నగేశ్‌కు భార్య భాగ్యలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కాగా.. ప్రేమ్‌కుమార్ స్థానికంగా చికిత్స పొందుతున్నాడు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉద్రిక్తత

కాంట్రాక్టు కార్మికుడు లింగంపల్లి నగేశ్ మృతికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, కార్మికులు బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మృతదేహంతో బైఠాయించారు. ఒకానొక దశలో మృతదేహంతో కార్యాలయంలోకి చొచ్చుకపోయే ప్రయత్నం చేయగా, డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో షెటర్లను మూసివేశారు. సుమారు మూడు గంటలకుపైగా ఆందోళన కొనసాగింది. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ మాట్లాడుతూ రూ.50 లక్షల పరిహారంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఎమ్మెల్యే హరీశ్‌బాబు, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ కార్యాలయానికి చేరుకుని కుటుంబీకులు, కార్మికులతో చర్చించారు. సుదీర్ఘ చర్చల అనంతరం రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా, తక్షణసాయం కింద దహన సంస్కారాలకు రూ.30 వేల నగదు అందించారు. డబుల్ బెడ్రూం ఇల్లు, ఇన్సూరెన్స్ నగదు రూ.15 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చేందుకు పూర్తి బాధ్యత వహిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఎమ్మెల్యే హరీశ్‌బాబు సొంతంగా రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తానని హామీ ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు, కార్మికులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ముంజం ఆనంద్‌కుమార్, శంకర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్యసేవలు అందేలా చూడాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఆశ్రమ పాఠశాలల ఏఎన్‌ఎంలు, వార్డెన్లను ఆదేశించారు. ఉట్నూర్‌లోని కుమురంభీం సమావేశ మందిరంలో బుధవారం గిరిజన పోషణ మిత్ర కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించాలని నాలుగు జిల్లాల డీఎంహెచ్‌వోలకు సూచించారు. నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పోషక విలువలు గల భోజనం అందించాలని ఏటీడీవోలకు సూచించారు. యూనిట్ అధికారులు రెండు ఆశ్రమ పాఠశాలలను దత్తత తీసుకోవాలన్నారు. ఇందులో ఉమ్మడి జిల్లా డీఎంహెచ్‌వోలు, ఏడీఎంహెచ్‌వో మనోహర్, డీటీడీవో రమాదేవి, ఏటీడీవోలు, జీసీడీవోలు, వార్డెన్లు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఉడుముతో ఇన్‌స్టా రీల్స్.. కేసు నమోదు

కడెం: సోషల్ మీడియాలో లైకులు, వ్యూస్ కోసం యువత ఇన్‌స్టా రీల్స్ చేస్తూ చిక్కుల్లో పడుతున్నారు. విభిన్నంగా ఉండాలని ఉడుము పట్టుకుని రీల్స్ చేసిన యువకుడిపై కేసు నమోదైంది. నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండలం అకొండపేట్ గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ మాడుగుల రాధాకృష్ణ గత నెలలో ఉడుము పట్టుకుని 'భయ్యా ఇప్పుడే నా వేట.. దొరకవట్టిన ఇప్పుడు పొలంలోకి వచ్చింది. కేజీన్నర ఉంటాది భయ్యా కష్టపడి పట్టుకున్నా.. ఇయ్యాల దావతే' అంటూ ఇన్‌స్టాగాంలో రీల్ పోస్ట్ చేశాడు. కరీంనగర్‌కు చెందిన జంతు ప్రేమికుడు ఎదులపురం గౌతం ఈ రీల్‌ను చూసి ఇటీవల నిర్మల్ డీఎఫ్‌వోకు ఫిర్యాదు చేశాడు. డీఎఫ్‌వో ఆదేశాల మే రకు బుధవారం నిందితుడిని పట్టుకుని కేసు నమో దు చేసినట్లు ఎఫ్‌ఆర్వో గీతారాణి తెలిపారు.

శోభాయాత్రలో విషాదం

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న గణేశ్ నిమజ్జన శోభాయాత్ర వేళ ఓ యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. పట్టణంలోని కురాన్నపేట్ కాలనీకి చెందిన లక్ష్మణ్–కవిత దంపతుల చిన్న కుమారుడు సుంక దరహాస్ (19) హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. మంగళవారం గణేశ్ నిమజ్జనానికి నిర్మల్ వచ్చాడు. రాత్రి 11 గంటల సమయంలో మరో యువకుడితో కలిసి ద్విచక్ర వాహనంపై శివాజీచౌక్ వైపు వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఫోన్ పోయిందని ఆత్మహత్యాయత్నం..!

భైంసాటౌన్: సెల్‌ఫోన్ పోయిందన్న కారణంతో మద్యం మత్తులో ఓ వ్యక్తి బ్రిడ్జి పైనుంచి దూకిన ఘటన బుధవారం భైంసా పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తానూర్ మండలం బామ్ని తండాకు చెందిన కాశీనాథ్ సెల్‌ఫోన్ మరమ్మతు కోసం భైంసాకు వచ్చి స్థానికంగా మద్యం సేవించి పడిపోయాడు. భార్య బులాబాయి ఫోన్ చేసినా స్పందించకపోవడంతో భైంసాకు చేరుకుని ఆటోస్టాండ్ వద్ద ఆరా తీసింది. దీంతో స్థానిక వైన్స్ వద్ద పడిపోయినట్లు తెలుసుకుని వెంటనే ఆటోలో గ్రామానికి తీసుకెళ్తుండగా ఆర్టీసీ డిపో వద్ద ఆటో ఆపి సెల్‌ఫోన్ పోయిందంటూ బ్రిడ్జిపై నుంచి దూకాడు. దీంతో తీవ్రగాయాలు కావడంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ గ్రామానికి చెందిన గుండేవణి బూదమ్మ(60) బలవన్మరణానికి పాల్పడింది. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ కథనం ప్రకారం.. దొనబండ గ్రామానికి చెందిన బూదమ్మ రెండేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం మధ్యాహ్నం ఇంటి ఆవరణలో ఉన్న బావిలో దూకింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నార. భర్త కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మేకకు మేత కోసం వెళ్లి వృద్ధుడు మృతి

కడెం: తాను పెంచుకుంటున్న మేకకు మేతకోసం వెళ్లిన వృద్ధుడు ప్రాణాలు వదిలిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని సారంగపూర్ గ్రామానికి చెందిన ఎగుర్ల భీరయ్య(78) బుధవారం ఉదయం మేకకు మేత కోసమని ఇంటి సమీపంలో ఉన్న పెరటి తోట వద్దకు వెళ్లాడు. తోటలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగ కోస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఖానాపూర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుని కుమారుడు రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

మేకలను కాపాడబోయి యువకుడు మృతి

తానూరు: ప్రమాదవశాత్తు చెరువులో మునిగి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన యాసిర్‌ఖాన్ (19) బుధవారం గ్రామానికి చెందిన అతిక్‌తో కలిసి మేకలు కాసేందుకు గ్రామ శివారులోని సంగన్‌గాం చెరువుకు వెళ్లాడు. మధ్యాహ్నం మేకలకు నీటిని తాగించే క్రమంలో రెండు మేకలు నీటిలోకి వెళ్లాయి. వాటిని రక్షించే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. విషయాన్ని అతిక్ కుటుంబ సభ్యులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించాడు. మృతుని తండ్రి మోయిన్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. సిరోంచ తాలూకాలోని టికాడ గ్రామానికి చెందిన రమేశ్, స్నేహల్, సాగర్ సొంత పనుల కోసం మోటార్ సైకిల్‌పై చెన్నూర్‌కు వచ్చారు. పనులు ముగించుకుని మోటార్ సైకిల్‌పై స్వగ్రామం వెళ్తుండగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

దాడికి పాల్పడిన నలుగురి అరెస్ట్

తాంసి: మండలంలోని హస్నాపూర్ గ్రామంలో ఈ నెల 17న నిర్వహించిన గణేశ్ నిమజ్జన శోభాయాత్రలో గ్రామస్తులపై దాడికి పాల్పడ్డ నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై శివరాం తెలిపారు. మక్కల దినేష్, దోత్రే నిఖిల్, దోత్రే బాలాజీ, మెట్‌కర్ విష్ణును అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి మరో ఇద్దరు విశాల్, చందు కోసం గాలిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆరోగ్యమిత్రల సమ్మె బాట

- నిరవధిక సమ్మెతో ఆరోగ్యశ్రీ సేవలకు ఆటంకం
- డిమాండ్లను నెరవేర్చాలని వినతులు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 74 మంది..


ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయాన్ని ముట్టడించిన ఆరోగ్య మిత్రలు

మంచిర్యాలటౌన్: ఆరోగ్యశ్రీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్లు పరిష్కరించాలని బుధవారం నుంచి నిరవధిక సమ్మె బాట పట్టారు. అన్ని జిల్లాల్లోని ఆరోగ్యమిత్రలు హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళనకు దిగారు. ఆరోగ్యమిత్రలతోనే ఆరోగ్యశ్రీ సేవలను అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో అందిస్తున్నారు. వారు సమ్మె బాట పట్టడంతో ఆరోగ్యశ్రీ సేవలకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉంది. 17 ఏళ్ల నుంచి పనిచేస్తున్నా రూ.13,533 మాత్రమే వేతనం ఉందని, ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలను నెట్టుకురావాల్సి వస్తోందని, తమ డిమాండ్లను పరిశీలించాలని కొన్నాళ్లుగా ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్, టీం లీడర్లు, ఆఫీసు అసోసియేట్లు, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. మంచిర్యాల జిల్లాలో 16 మంది ఆరోగ్యమిత్రలు పనిచేస్తుండగా, ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 74 మంది ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆరోగ్యశ్రీ టీం లీడర్ల సహాయంతో ప్రస్తుతం ఆరోగ్యశ్రీ సేవలకు ఆటంకం కలగకుండా చూస్తున్నా నిరవధిక సమ్మె కొనసాగితే ఇబ్బందిగా మారే అవకాశం ఉంది.

వేతనాలు సరిపోవడం లేదని...

ఆరోగ్యమిత్రల వేతనం రూ.15 వేలు కాగా, కటింగ్‌లు పోను చేతికి వచ్చేది రూ.13,533 మాత్రమే. ప్రతీ నెల ఒక సెలవు ఇస్తుండగా.. ఆదివారాలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ పథకం, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, ఆయుష్మాన్ భారత్, జర్నలిస్టు హెల్త్ స్కీమ్‌కు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జిల్లా మేనేజర్, టీమ్ లీడర్, ఆఫీస్ అసోసియేట్, ఆరోగ్యమిత్రలుగా 24గంటలపాటు విధులు నిర్వర్తిస్తున్నారు.

డిమాండ్లు ఇవే..

- ఆరోగ్యమిత్రలకు డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించి, జీవో 60 ప్రకారం రూ. 22,750 వేతనాన్ని తక్షణమే అమలు చేయాలి.
- జీతభత్యాలు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా ట్రస్టు ద్వారానే చెల్లించాలి. కాంట్రాక్టు విధానంలోకి మార్చాలి.
- రాబోయే పీఆర్సీలో కనీస వేతనం రూ.35 వేలతోపాటు టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలి.

వేతనాలు సరిపోవడం లేదు



ఆరోగ్యశ్రీ ట్రస్టు ఏర్పాటు చేసినప్పటి నుంచి ఉద్యోగం చేస్తున్నాను. వేతనాలు పెంచకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. డిగ్రీ, పీజీలు చదివిన వారే ఉన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి ఉద్యోగ భద్రతను కల్పించాలి.
– శారద, ఆరోగ్యమిత్ర, మంచిర్యాల

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఆరోగ్యశ్రీ ట్రస్టు ఏర్పడినప్పుడు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా చేరాం. 17 ఏళ్లుగా సేవలు అందిస్తున్నా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగానే గుర్తిస్తున్నారు. వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించి, కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలి. ట్రస్టు ద్వారా వేతనాలు అందించాలి.
– ప్రవీణ్, ఆరోగ్యమిత్ర, నిర్మల్

లోకేశ్వరంలో చోరీ

లోకేశ్వరం: మండల కేంద్రానికి చెందిన ప్రైవేటు వైద్యుడు వెంకటేష్ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు ఏఎస్సై దిగంబర్ తెలిపారు. వెంకటేష్ ఇంటికి తాళం వేసి గడ్‌చాందకు వెళ్లగా గమనించిన గుర్తు తెలి యని దుండగులు ఇంటితాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న 15 గ్రా ముల బంగారం, రూ.60 వేల నగదు ఎత్తుకెళ్లారు. బుధవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

కుభీర్: మండలంలోని కీరునాయక్ తండాకు చెందిన సీఐఎస్ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ రాథోడ్ లచ్చు (57) సోమవారం చెన్నైలో అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహాన్ని బుధవారం స్వగ్రామానికి తీసుకురాగా రామగుండం నుంచి వచ్చిన సీఐఎస్ఎఫ్ జవాన్లు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య సేవంతాబాయి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సమసమాజ స్థాపనే పీడీఎస్‌యూ లక్ష్యం


పీడీఎస్‌యూ సభ లోగో ఆవిష్కరణ

మంచిర్యాలఅర్బన్: సమ సమాజ స్థాపన లక్ష్యంతో పీడీఎస్‌యూ ఏర్పడిందని వక్తలు అభిప్రాయపడ్డారు. బుధవారం స్థానిక మార్క్స్‌భవన్‌లో మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల పూర్వ, ప్రస్తుత పీడీఎస్‌యూ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ద వారోత్సవ సభ లోగో ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ ఏర్పడి 50 సంవత్సరాలైన నేపథ్యంలో అక్టోబర్ 24న హైదరాబాద్‌లో జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అడ్వకేట్ ఆర్.ప్రకాశం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టి.శ్రీనివాస్, నైనాల గోవర్ధన్, వేణు, మంగ, సమ్మయ్య, రజియా, మల్లేష్, చంద్రయ్య, లాల్‌కుమార్, శ్రీకాంత్, చరణ్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

సిర్పూర్(టి): మండల కేంద్రం మీదుగా అక్రమంగా తరలిస్తున్న పశువులను సిర్పూర్(టి) పోలీసులు పట్టుకున్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి మహారాష్ట్ర మీదుగా రెండు ఐచర్ వాహనాల్లో కర్ణాటకలోని కోలార్ ప్రాంతాని కి అక్రమంగా 35 పశువులు(34 ఆవులు, ఒక ఆవు) తరలిస్తుండగా సిర్పూర్(టి) మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నామని ఎస్సై కమలాకర్ తెలిపారు. సి.రామచంద్ర(కర్ణాటక), నవాబ్‌ఖాన్, స లావుద్దీన్, అల్తాఫ్‌ఖాన్, ఎస్‌కే ఆదిల్ పాషా, ఆదిఫ్ పాషాపై కేసులు నమోదు చేసి, విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.